క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ




ఏ.రమేష్‌రెడ్డి, సీఐ   ఎస్. ఇస్మాయిల్, ఎస్ఐ

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఏ. రమేష్‌రెడ్డి, ఎస్ఐగా ఎస్. ఇస్మాయిల్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ భార్గవరెడ్డి కోసిగికి బదిలీ కాగా చిత్తూర్ జిల్లా మదనపల్లి నుంచి సీఐ ఏ.రమేష్‌రెడ్డి బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఆదోని నుంచి ఎస్ఐ ఇస్మాయిల్ ఇక్కడి వచ్చారు. అలాగే హెడ్‌కానిస్టేబుల్ ఎస్.రాముడు, పీసీలు సూర్యప్రకాష్, కరుణాకర్, రామలింగమ్మ, నాగార్జునరెడ్డి, సుధాకర్, జీవమణి, ఇజ్రాయిల్‌లు బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఎక్సైజ్ సీఐగా పి.భార్గవ్ రెడ్డి



కోసిగి: పెద్దకడబూరు, కోసిగి మండలాల సర్కిల్ ఎక్సైజ్ సీఐగా పి.భార్గవ్ రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎమ్మిగనూరు సర్కిల్ స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ మహబూబ్ బాషా అనంపురం జిల్లా కళ్యాణదుర్గం బార్డర్ మొబైల్ పెట్రోలియం పార్టీ సీఐగా బదిలీపై వెళ్లారు. సీఐ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో కోసిగిలో రెండు, పెద్దకడబూరు మండలానికి రెండు మద్యం దుకాణాలు చొప్పున ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈనెల 9వ తేదీలోగా మద్యం దుకాణాలకు రూ.2లక్షలు డిపాజిట్ చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

పరిసరాలను అపరిశుభ్రం చేయొద్దు



కళాశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పరిసరాలను అపరిశుభ్రం చేయొద్దని కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ సూచించారు. మంగళవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా దివాస్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ అపరిశుభ్రమైన వాతవరణం కల్పించడం ద్వారా మనం రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అందుకే ఎప్పుడూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఎన్‌సీసీ విద్యార్థులు పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ అధికారి గోవిందు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఆవోపా ఆధ్వర్యంలో గాంధీ జయంతి



విద్యార్థినికి నోటు పుస్తకాన్ని అందజేస్తున్న ఆవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్త

ఆదోని అర్బన్: పట్టణ ఆవోపా వారి ఆధ్వర్యంలో డీఎస్పీ బంగ్లా రోడ్డులోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో మంగళవారం ఘనంగా మహాత్మాగాంధీ జయంతోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా 45 మంది విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంచిపెట్టారు. పట్టణ ఆవోపా అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్త, ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్నశెట్టి, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం వెంకటరాముడు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక



విద్యార్థి యోధ శంకర్‌రెడ్డిని అభినందిస్తున్న విట్టా రమేష్, మల్లప్ప తదితరులు

ఆదోని అర్బన్: ఆదోని క్రికెట్ అసోసియేషన్ క్రీడాకారుడు టి.యోధ శంకర్‌రెడ్డి కర్నూలు జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. స్థానిక లీలా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న టి.యోధ శంకర్‌రెడ్డి ఈనెల 4 నుంచి 23వ తేదీ వరకు కడపలో జరిగే అండర్–14 అంతర్ జిల్లా పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించడంపై ఆదోని క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విట్టా రమేష్, వైస్ ప్రెసిడెంట్ ముజీబ్, మల్లప్ప హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థిని అభినందించారు. జాయింట్ సెక్రటరీ జె.ఎం.బాషా, వై.మహదేవ్, ట్రెజర్ వెంకటేష్‌బాబు, అసోసియేషన్ సభ్యులు రవీంద్ర ఉన్నారు.

పార్లపల్లి విద్యార్థినికి కర్నూలు మెడికల్ కాలేజీలో సీటు



చెవ్వ అపర్ణ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి చెందిన మంజునాథ్‌రెడ్డి, కృష్ణవేణిల రెండవ కుమార్తె చెవ్వ అపర్ణ నీట్‌లో 632 మార్కులు సాధించి కర్నూలు మెడికల్ కాలేజీలో సీటు సంపాదించింది. కర్నూలు మెడికల్ కాలేజీలో సీటు వచ్చినందుకు చాల సంతోషంగా ఉందని తల్లిదండ్రులు చెప్పారు.

ఏడి ‘పింఛన్’

- కొత్త పింఛన్లు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- నేటికీ తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్
- కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అవ్వాతాతలు
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు



పెద్దనేలటూరు గ్రామ సచివాలయం

గోనెగండ్ల : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి నాలుగు నెలలవుతోంది. ఇంత వరకూ కొత్త పింఛన్ల మంజూరుపై కార్యాచరణ రూపొందించలేదు. అక్టోబర్ 1 నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వ పెద్దలు గతంలో ఆర్భాటంగా ప్రకటించారు. దీంతో అర్హులైన వారు పింఛన్లు కోసం ఆశగా ఎదురుచూశారు. అయితే నూతన పింఛన్లు మంజూరు చేయకపోడవడంతో నిరాశచెందారు. గత ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం పింఛన్లు మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అర్హులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

నిరాశలో లబ్ధిదారులు

అక్టోబరు1న ప్రభుత్వం పింఛన్ల పంపిణీని చేపట్టింది. సెప్టెంబర్ నెలలో మండలంలో 9,108 మంది పింఛన్‌దారులకు రూ.3,89,69,500 మంజూరు కాగా ఈనెలలో రూ. 9,090 మంది పింఛన్ దారులకు రూ.3,89,09,500 మంజూరయ్యింది. అయితే కొత్తగా ఒక్కరికీ కూడా పింఛన్ ఇవ్వలేదు. అయినా ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం చేసుకుంటుండడంతో ఇదెక్కడి విడ్డూరమని సర్వత్రా చర్చించుకుంటున్నారు. దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు ప్రతి రోజూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళ్తున్నారు. అయితే ప్రభుత్వ వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో ఇంకా తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గతంలో పక్కాగా పథకాల అమలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి పథకం పక్కాగా అమలయ్యేది. పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే అందించేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగించారు. నేడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం పింఛన్లు, రేషన్‌కార్డుల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. దీంతో కొత్తగా పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇతర పథకాలు ఎప్పుడు ఇస్తారోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఆగిన వెబ్‌సైట్ కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు దాటినా ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారులకు సచివాలయం సిబ్బంది సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారు.

పింఛన్లు తొలగించే కుట్ర

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు వస్తున్న పింఛన్లను అనర్హత పేరుతో తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం ప్రజలు ఎదురు చూస్తుంటే ఉన్న పింఛన్లు తొలగించడానికి కుట్రలు చేయడంపై తీవ్ర స్థాయిలో విమర్శలొస్తున్నాయి.

పింఛన్ కోసం ఎదురు చూస్తున్నా



నా భర్త ఇబ్రహీం చనిపోయి దాదాపు ఆరు నెలలు అవుతుంది. సీఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల్లో ఇచ్చే పింఛన్ కోసం ఎదురుచూస్తున్నాను. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ కూతుర్ని చదివిస్తూ కుంటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. పింఛన్ కోసం దరఖాస్తు చేయాలనుకుంటే వెబ్‌సైట్ రావడం లేదు అంటున్నారు. కొత్త పింఛన్లు మంజూరు చేస్తే నాలాంటి నిరుపేదలకు అండగా ఉంటుంది.

– బగిలి సోఫియా, గోనెగండ్ల

చేనేతలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రాజు

ఎమ్మిగనూరుటౌన్: చేనేత కార్మికులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి రాజు అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత వస్త్రాలకు రాయితీ కల్పించాలని కోరారు. ప్రస్తుతం చేనేత కార్మికులకు పనులు లేక ఇతర వృత్తులకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 11రకాల వస్త్రాలు చేనేతల ద్వారా తయారు చేయించాలని జీఓ ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం కింద ఏటా నేత కార్మికులకు రూ.24వేలు ఇచ్చేదని, అయితే ఈపథకాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. చేతి వృత్తిదారుల సంఘ జిల్లా కార్యదర్శి గోవిందు, చేనేత నాయకులు ఎం.కృష్ణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం



చెకుముకి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

కౌతాళం: విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం, శాస్త్రీయ ఆలోచనలు అవసరం అని కౌతాళం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఇమాన్యుయల్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టును మంగళవారం నిర్వహించారు. యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, ఇమాన్యుయల్ ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరించారు. పరీక్షల్లో ప్రతిభా ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, ఎరిగేరి పాఠశాల ద్వితీయస్థానంలో, తృతీయ స్థానంలో కౌతాళం జెడ్పీ పాఠశాల విద్యార్థులు నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈనెల 27న జరిగే జిల్లాస్థాయి చెకుముకి పరీక్షల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుధాకర్, వెంకటేశ్వర్లు, మంగరాజు, ఈరన్న, తేజప్ప, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి

కోసిగి: ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య అన్నారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు ముగిశాయి.

పింఛన్ల పంపిణీ



చిన్నహరివాణంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని రూరల్: మండలంలోని చిన్నహరివాణం గ్రామంలో మంగళవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లను అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ట్యాంక్ బండ్ ప్రాంతంలో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు.

ఆదోని టౌన్: పట్టణంలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మున్సిపల్ కమిషనర్ కృష్ణ, సిబ్బంది పంపిణీ చేశారు. 42 వార్డుల పరిధిలో మున్సిపల్ సిబ్బంది, వార్డు సచివాలయ అధికారులు, కౌన్సిలర్లు ఇంటింటికీ తిరుగుతూ పింఛన్లను అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో 16,909 మందికి గానూ 16,117 మందికి పింఛన్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. 95.32 శాతం పంపిణీ పూర్తి చేశామని తెలిపారు.

క్రీడల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

గోనెగండ్ల : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో మోడల్ స్కూల్‌లో సీనియర్ ఇంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరచి పలు విభాగాల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్ మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మహేంద్ర 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానంలో నిలిచాడన్నారు. 100 మీటర్ల పరుగు పందెంలో ఖాసీం మూడోస్థానంలో, ముస్తఫా లాంగ్‌జంప్‌లో మూడో స్థానం సాధించాడని చెప్పారు. క్రికెట్‌లో ఓంకార్, హాకీలో ఆసిఫ్, బాబు, బ్యాడ్మింటన్‌లో నరేంద్రనాయుడు, శేషన్న, త్రోబాల్‌లో గణేష్ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. అలాగే మండల స్థాయి సైన్స్ చకుముకి పరీక్షల్లో శ్రీకాంత్, ఇంతియాజ్, భాస్కర్ ప్రతిభ కనపరచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

క్రీడాకారుడికి అభినందన



బీఆర్ నవీన్‌కుమార్‌కు బహుమతి అందిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని రెయిన్ బో ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బీఆర్ నవీన్‌కుమార్ జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు ఎన్నికైన సందర్భంగా ఆ పాఠశాల డైరెక్టర్ రంగారెడ్డి, కరస్పాండెంట్ గోవిందరెడ్డి అభినందనలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఇటీవల కోసిగిలో జరిగిన అండర్ – 14 విభాగం డివిజన్ స్థాయి ఖోఖో పోటీలలో నవీన్‌కుమార్ ప్రతిభ చాటి జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎన్నికైనట్లు తెలిపారు.

నేటి నుంచి దసరా సెలవులు

ఆదోని సెంట్రల్: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలకు బుధవారం నుంచి దసరా సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లు మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కే. శామ్యూల్ గారి ఆదేశాలు ప్రకారం ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులను ప్రకటించారన్నారు. ఒక రోజు ముందు అంటే నేడు మహాత్మగాంధీ జయంతి సందర్భంగా పాఠశాలలకు సెలవు దినము కనుక ఒకరోజు ముందుగానే విద్యార్థులకు సెలవు కలసి వచ్చిందని తెలిపారు. తిరిగి పాఠశాలలు ఈ నెల 14వ తేదీన పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ



రైతుమిత్ర గ్రూప్ సభ్యులకు వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్న నార్మ్ సంస్థ అధికారులు

పెద్దకడబూరు : ప్రభుత్వం నుంచి ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.13.5 లక్షల విలువ చేసే వ్యవసాయ పరికరాలను రైతులకు పంపిణీ చేసినట్లు నార్మ్ సంస్థ, ఎస్సీ సబ్‌ప్లాన్ చైర్మన్ డాక్టర్ ఎం.బాలకృష్ణన్ తెలిపారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ 2023 – 24 పథకం కింద జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ(నార్మ్) సంస్థవారు ఎస్సీ రైతుమిత్ర గ్రూపునకు ఏఓ ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో రెండు కల్టివేటర్లు, రెండు పవర్ వీడర్లు, రెండు డిస్క్ నాగల్లు, రెండు చెక్క నాగళ్లు, రెండు లెవెలింగ్ బ్లేడ్లు, రెండు విత్తన గొర్రులు, రెండు రోటోవేటర్లు, రెండు మల్చర్లు సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నార్మ్‌సంస్థ హైదారాబాద్ కార్యాలయంగా ఉంటూ దేశంలోని అన్ని రాష్ట్రాలలో కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు. ఎస్సీ రైతుల అభివృద్ధి కోసం ఉచితంగా పంపిణీ చేసిన ఈ పరికరాలను ఎటువంటి భేదాభిప్రాయం లేకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నార్మ్‌సంస్థ అధికారులు డాక్టర్ యం.రమేష్‌నాయక్ (శాస్త్రవేత్త), టెక్నికల్ ఆఫీసర్లు డాక్టర్ విజయేంద్రరెడ్డి, డాక్టర్ శ్రీధర్, వ్యవసాయ సిబ్బంది, సర్పంచ్ జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరురూరల్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని గుడేకల్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో డీటీఎఫ్ నాయకులు నిరసన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం కర్నూలులోని గాంధీ విగ్రహం వద్ద డీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, మారుతి, షుకూర్ సాహెబ్, రాముడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి

ఎమ్మిగనూరురూరల్: సత్యం, అహింసా గాంధీజీ భావాజాలమని హెచ్‌ఎం శాంతిరాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాసుమాన్‌దొడ్డి గ్రామం ఎంపీపీ పాఠశాలలో గాంధీ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ఉన్నందున ముందుగానే గాంధీ జయంతి వేడుకలను జరుపుకున్నట్లు చెప్పారు. అనంతరం సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు వీరేష్‌రాజు, మునిస్వామి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను కాపాడాలి

కౌతాళం: తిరుపతి తిరుమల దేవస్థానంలో అన్యమతస్తులను తొలగించి దేవాలయాల పవిత్రతను కాపాడాలని బజరంగదళ్ మండల అధ్యక్షుడు నరేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేక చట్టంతో దేవాలయ ధర్మదాయశాఖ ద్వారా ప్రభుత్వం చేస్తున్న పెత్తనాన్ని తప్పించి స్వామీజీలకు అప్పగించాలని డిమాండు చేశారు. హిందువుల ఆరాధ్య దైవం కలియుగ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కల్తీ విషయంలో గౌరవనీయులైన సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. విశ్వహిందూ పరిషత్ కార్యకర్తులు నారాయణ, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

టీటీడీలో ఈఓ వ్యవస్థను రద్దు చేయాలి

ఆదోని అర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానంలో ఈఓ వ్యవస్థను తీసివేయాలని, స్వయం ప్రతిపత్తి వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక అభయ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి వీహెచ్‌పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోట్ల కూడలిలో మానవహారంగా నిలిచి నిరసన వ్యక్తం చేశారు. అక్కడి నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేశారు. వీహెచ్‌పీ నాయకులు విట్టా రమేష్, కునిగిరి నీలకంఠ, శ్రీనివాస్రెడ్డి, శ్రీనివాస్ ఆచారి, వర్మ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ర్యాలీని ప్రారంభించారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు బాలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రకు అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఉచిత ఇసుక ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 100 రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో ఇచ్చిన హామీలు ఇంత వరకూ నెరవేర్చలేదని అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సత్యన్న, బాబు, నరేంద్ర, రఘు, మల్లేశప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సారు.. రోడ్ల మరమ్మతు చేయించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణం నుంచి కర్నూలుకు వెళ్లే ప్రధాన రహదారితో పాటు కోసిగి రోడ్డు, పట్టణంలోని పలు రోడ్లకు మరమ్మతులైనా చేయించండి ఎమ్మెల్యే సారు.. అని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ కోరారు. మంగళవారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల పాలనలో మంచి పనులు చేశామని చెప్పుకునే ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పట్టణంలో శిథిలమైన రోడ్లపై దృష్టి సారించి వాటిని పునర్నిర్మించాలని కోరారు. గోనెగండ్ల బైపాస్ రోడ్డుతో పాటు కలుగొట్ల రోడ్డు, కోసిగి వెళ్లే రోడ్డు పూర్తిగా శిథిలమయ్యాయన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకులు అనీఫ్, విజయ్‌కుమర్, బాలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న మద్యం దుకాణాల సిబ్బంది

ఆదోని రూరల్: ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రైవేట్ పరం చేసేలా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం జీఓ జారీ చేయడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది మంగళవారం విధులను బహిష్కరించి, మద్యం దుకాణాలను మూసివేసి నిరసన తెలియజేశారు. మద్యం దుకాణ సిబ్బంది వీరేష్, చంద్రశేఖర్, వినోద్, రాము తదితరులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తాము గతంలో పనిచేస్తున్న ఉద్యోగాలను వదిలివేసి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసేందుకు చేరామన్నారు. నేడు తమకు ఎలాంటి ఉద్యోగ భద్రత కల్పించకుండా మద్యం దుకాణాలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసేలా జీఓ జారీ చేయడం అన్యాయమన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించేంతవరకు తాము విధుల్లోకి చేరబోమని తెగేసి చెప్పారు. అనంతరం ఎక్సైజ్ సీఐ సైదులుకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు బంద్ కావడంతో మందుబాబులకు మద్యం లభించక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సమగ్ర పోషణ అందించడమే లక్ష్యం



సక్షం అంగన్‌వాడీ కేంద్రం కార్యక్రమంలో హెచ్‌ఎం హేమంత్ బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు

కోసిగి: సక్షం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి సమగ్ర పోషణ అందించడమే లక్ష్యమని కేజీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం హేమంత్ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక 8వ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సక్షం అంగన్‌వాడీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, 6 ఏళ్ల లోపు చిన్నారులకు అందించే పోషక విలువలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లూసమ్మ, వరలక్ష్మి, కేశమ్మ, సంగీత, పెదక్క, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనధికార చార్జీలు వసూలు చేస్తే ఫిర్యాదు చేయండి



పోస్టర్ విడుదల చేసిన యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి

ఆదోని అర్బన్: రైతుల నుంచి కమీషన్ ఏజెంట్లు అనధికార చార్జీలు వసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని మార్కెట్‌యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డులో రైతులకు అవగాహన కల్పిస్తూ పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డులో సరుకు అమ్మిన వెంటనే ప్రభుత్వం నిర్ణయించిన కమీషన్ చార్జీలు, హమాలీ చార్జీలు, కాటా కూలీలు మాత్రమే రైతుల నుంచి వసూలు చేయాలన్నారు. అనధికారికంగా వడ్డీ, ఏ ఇతర చార్జీలు వసూలు చేసినా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఫిర్యాదు చేయదలచిన రైతులు సెల్ 9391800179 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు దసరా వేడుకలు



అమ్మవారి పూజలో భాష్యం విద్యార్థులు



నవదుర్గల రూపంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న నారాయణ విద్యార్థినులు

ఎమ్మిగనూరు/ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు. బుధవారం నుంచి పాఠశాలలకు సెలవులు ఉండటంతో ముందస్తుగా సంబరాలు జరుపుకున్నారు. భాష్యం ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో ప్రిన్సిపాల్ మాచాని కవిత , నారాయణ పాఠశాలలో ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. నారాయణ స్కూల్‌లో అమ్మవారి వేషధారణలో విద్యార్థిని ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, నిందితులతో ఎస్ఐ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామ సమీపంలో కర్ణాటక మద్యం బాటిళ్లను ఇద్దరు వ్యక్తులు తరలిస్తుండగా పట్టుకున్నట్లు కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం తుంగభద్ర నది తీర గ్రామాల్లో పర్యటిస్తుండగా మండలంలోని కడదొడ్డి గ్రామానికి చెందిన తోవి వినోద్, కౌతాళం మండలం తిప్పల దొడ్డి గ్రామానికి చెందిన కాకం గారి జగదీష్ 10 బాక్స్‌లలో 960 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిపై ఇద్దరుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఏఎస్ఐ తిరుపాల్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, మల్లికార్జున ఉన్నారు.

హాస్టల్ భవనానికి మరమ్మతులు చేపట్టండి

ఆదోని సెంట్రల్: శిథిలావస్థకు చేరుకున్న ప్రీ మెట్రిక్ బీసీ సంక్షేమ వసతి గృహానికి మరమ్మతు పనులను చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సహాయ బీసీ సంక్షేమ అధికారి రాజు కుల్లాయప్పను కలసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న భవనంలోనే విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారన్నారు. గదులలో పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు ముంచుకొస్తాయో తెలియక విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమములో ఎస్ఎఫ్ఐ నాయకులు సూరి, శశిధర్, దేవరాజు, లోకేష్, భరత్ కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.